# మనిషి - మాను

## గంటి శ్రీరామమూర్తి

శీతయ్య ఎంత కాలం నుంచి ఆ ఇంట్లో ఉంటున్నాడో ఎవరికీ తెలియదు. శీతయ్య తాత తండ్రులంతా ఆ ఇంట్లోనే పుట్టిపెరిగి మట్టయి పోయారు. ఇంటిముందు నేరడి చెట్టు కూడా అంత కాలంనుంచి ఉందేమో! ఆ చెట్టుకొమ్మలు ఇంటి మీదికి ప్రాకి ఉన్నాయి. ఆ చెట్టు మీద ఎన్నో పక్షులు నివాసం ఏర్పరచుకొన్నాయ్. వచ్చీపోయే పక్షులకు లెక్కే లేదు. మొత్తంమీద శీతయ్య ఇంట్లో ఎంత సందడిగా ఉంటుందో, ఇంటిపైన కూడా అంత సందడి ఉంటుంది.

శీతయ్య ఇప్పుడు బాగా ముసలై పోయాడు. నడవడమే కష్టం. ఇంచుమించుగా రోజంతా మంచంమీదె గడుపుతున్నాడు. సంసారం అంతా కొడుకు సాంబయ్య, కోడలు లచ్చమ్మ నడుపుకుంటున్నారు. పొలంపని సాంబయ్య చూస్తే ఇంటి చాకిరీ అంతా లచ్చమ్మ చేస్తుంది. లచ్చమ్మకు పనంటే విసుపు లేదు. కాని వాకిట్లో చెట్టు ఆమెకు ప్రాణాంతకంగా వుంది. పొద్దున్నే లేచేసరికి ఆకులు కుప్పలు కుప్పలుగా పడిఉంటాయ్. వాటిని ఊడ్చి వాకిలి శుభ్రం చేసేసరికి ఆమె తలప్రాణం తోకకు వస్తూంది. ఎన్నిసార్లు తుడిచినా మళ్ళీ ఆకులూ, పళ్ళూ ప్రత్యక్షం. పిల్లలంతా ఎప్పుడూ ఆ చెట్టు కిందే ఉంటారు. ఆ పళ్లకోసం చెట్టెక్కి కాలూ, చెయ్యీ విరచుకుంటారేమోనన్న భయం ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. దారిని పోయేవాళ్లు కూడా అదును చూసుకుని రాళ్లు రువ్వి పళ్లేరుకోడం పరిపాటై పోయింది. ఆ రాళ్లు ఇంట్లోవాళ్లకు తగిలే అవకాశం కూడా లేకపోలేదు. మొదట్లో నేరడి పళ్లేరుకొని తినడం ఇతరులకు పెట్టడం సరదాగా ఉన్నా, కాలం గడుస్తూన్న కొద్దీ, ఓపిక తగ్గుతూన్న కొద్దీ లచ్చమ్మకు విసుపూ, కోపం ఎక్కువవసాగాయి. ఆ చెట్టు వల్ల ఒక్కొక్కప్పుడు నిద్రాభంగం కూడాను. రాత్రంతా పళ్లు వాన చినుకుల్లా రాలుతూ కొప్పు మీద శబ్దం చేస్తూ, చిరాకు కలిగించడం కూడా కద్దు. ఎలకలదేపనిగా చెట్టు మీద నుంచి ఇంటి మీదికి, ఇంటి మీద నుంచి చెట్టు మీదికి తిరుగుతూ ఉండడం, అప్పుడప్పుడు పిల్లి దభాలున చెట్టు మీద నుంచి దూకుతూండడం కూడా అలవాటే. సాంబయ్య కూడా చాలాసార్లు విసుక్కున్నాడు.

ఒకరోజు సాయంకాలం ఇంటికొచ్చేసరికి సాంబయ్య కొడుకు చేతికి కట్టుతో కన్పించాడు. సాంబయ్యకు నడుం విరిగినట్లైంది. ఇంతలో లచ్చమ్మ వచ్చింది నేరడి చెట్టుకు శాపనార్థాలు పెడుతూ. ఆ చెట్టు లేకపోతే, పిల్లాడు చెట్టు మీంచి పడడం ఉండేది కాదు. సాంబయ్యకు కూడ అదే తోచింది. జరిగిందంతా తండ్రితో చెప్పి చెట్టు కొట్టిస్తే బాగుంటుందన్నాడు. తండ్రి ఎంత మాత్రం ఒప్పుకోలేదు.

"చూడు సాంబూ! చెట్టు లేనంత మాత్రాన దెబ్బ తప్పుతుందా? ఎంత మంది పిల్లలు ఇక్కడ మనచెట్టు దగ్గరకు వచ్చి ఆడుకోవడం లేదు. వాళ్లకు దెబ్బ తగలడానికి అవకాశం ఉందా? లేదా? ఆలోచించు. మన కుర్రాడు ఇంకోచోట ఇంకోచెట్టు మీంచి పడితే అప్పు డెవరిననగలం? ఇంతకూ మన పిల్లల్ని కొంచం జాగ్రత్తగా చూసుకోవాలి కాని, మధ్యను చెట్టేం చేస్తుంది? మా తాతలు నాటిన ఈ చెట్టు నీడనే మన వాళ్లంతా పెరిగి పెద్దవాళ్లై కాలక్రమాన కళ్లు మూసారు. ఈనాటిదా ఆ చెట్టు? ఆ కొమ్మల మీద కోతుల్లాగ ఆడుతూ పాడుతూ పెరిగాన్నేను. కాచీ పూచే చెట్టు, దాన్ని నరుకు తానంటావేమిరా?" అని మందలించాడు.

సాంబయ్య మరి మాట్లాడలేక పోయాడు. అయితే లచ్చమ్మ వెంటనే అందుకుంది. "తాతలనాటిది కదా అని ఎంత కాలం సహిస్తాం. చాకిరీ చేయలేక చస్తున్నాను నేను. అటు ఇంట్లో పనితో సతమతమౌతూ యీ పిల్లల్ని ఎలా కాచుకోడం. మీరు చూస్తే మంచం దిగే స్థితిలో లేరు. ఈ చెట్టు లేకపోతే ములిగిందేముంది?"

"ఔనమ్మా! నీవు చెప్పిందీ నిజమే. ఈ చెట్టువల్ల మనకు కొంత ఇబ్బంది అన్నమాట నిజమే కాని జీవితంలో ఎన్నో ఓర్చుకోవాలి తల్లీ! మనకు కష్టం కలిగినంత మాత్రాన దేన్నీ తొలగించడం సాధ్యం కాదు. ఇంతకూ చెట్టు నిర్జీవం కాదు. అది కావాలని మన్ని బాధించడం లేదు. దానికి ఆకు రాల్చడం సహజం. 'మధురమైన ఫలాల్నివ్వడం కూడా సహజమే. మనం ఎలా పెరిగామో, అదీ అలాగే పెరిగింది. నిస్వార్థంగా నీడను, పళ్లనూ అందరికి ఇస్తున్న ఆ చెట్టు, మనకు మంచి సేవ చేస్తూంది. నాకు సాంబు ఒకటీ, ఆ చెట్టు ఒకటీ కాదు. ఇంక చెట్టు విషయం విడిచి పెట్టండి" అన్నాడు శీతయ్య. లచ్చమ్మ నోరు కూడా అప్పటికి మూత పడింది.

రోజులు గడిచాయి. శీతయ్య రోజూ ఆ చెట్టును చూసుకుంటూ గతాన్ని నెమరు వేసుకుంటూ ఉండేవాడు. ఇంతలో ఒక రోజున మళ్లా ఒక సంఘటన జరిగింది. ఒక పిల్లవాడు పండ్ల కోసం రాయి విసిరాడు. అది అవతల వైపున ఉన్న లచ్చమ్మకు టకీమని తగిలి తల బొప్పి కట్టింది. ఆమె కోపంతో వణికి పోయింది. ఇంక లాభం లేదనుకొని చెట్టును ఎలాగైనా నరికించాలని నిశ్చయించుకొంది. చెట్టును, రాయి విసిరిన అబ్బాయిని నానా తిట్లు తిట్టింది. సాయంత్రం సాంబయ్య రాగానే మళ్లా మొదలెట్టింది. ఆ చెట్టు ససేమిరా ఉండ డానికి వీల్లేదంది. సాంబయ్యకు కూడా అలాగే అనిపించింది. తీవ్రమైన కోపంతో తండ్రి దగ్గరకు వెళ్లి ఇలా అన్నాడు "నాన్నా! ఇంకా ఆ చెట్టు ఉండాలనే అంటావా? లచ్చమ్మ అజాగ్రత్తవల్లే దెబ్బ తగిలిందంటావా? అది ఇచ్చే పండ్ల వలన కాలు నిండెనా? కడుపు నిండెనా? చాకిరీ మాత్రం మిగులు. పైపెచ్చు దెబ్బలు కూడా తినాలిసి వస్తోంది. ఇప్పుడైనా ఒప్పుకో చెట్టు నరికించడానికి."

శీతయ్య ఒకక్షణం మౌనంగా కూర్చొన్నాడు. ఆవేశపడుతూన్న కొడుకుని చూసి శాంతంగా అన్నాడు "సాంబూ, నీకు గుర్తుందా మనింట్లో నారయ్య అని మా పింతండ్రి కొడుకు ఉంటూ ఉండేవాడు."

"ఆ! జ్ఞాపకం లేకేం! అతని నిర్వాహకం ఎవరికి తెలియనిది? తిండికి తిమ్మరాజు; పనికి పోతరాజు. పైగా దారినపోయే వాళ్లందరితో గిల్లి కజ్జాలు. పాపం దిక్కులేనివాడు, మనవాడు కదా అని అంత రభసా భరించాం."

"అదిగో, అదే నేచెప్ప బోయేదీని. వస్తువు మనదైన రోజున, అది ఎంత వరకూ ఉపయోగం అన్న ప్రశ్న లేదు. అది మంచిదైనా, చెడ్డదైనా, మనదే. మనతోపాటే ఉంటుంది. ఈ చెట్టు క్రిందే ఒకరోజున మానాన్న నాతో అన్నాడు. 'శీతయ్యా ఈ చెట్టు మా నాన్న నాటాడు. నాతోపాటే పెద్దదైంది. దీన్ని చూస్తుంటే, ఇది నాకు దైవమిచ్చిన సోదరుడేమో అనిపిస్తుంది. మండుటెండల్లో తనదయా హస్తాలను చాచి చల్లని నీడని ప్రసాదించిందీ చెట్టు. సాయంకాలం ఈ చెట్టు క్రింద కూర్చుని మనమంతా కబుర్లు చెప్పుకుంటూంటే, అది కూడా మన కబుర్లను వింటూండేది. చిరుతిండి కావలసి నప్పుడు పండ్లనిచ్చి కడుపు నింపుతుంది. నేను నీకు ఇవ్వగలిగినది ఈ ఇల్లు, ఈ చెట్టు మాత్రమే. ఇవి ఆస్తి కన్న విలువైనవి సుమా!' ఔను. ఆ మాటలు నిజమనిపిస్తుంది ఇప్పటికీ నాకు. ఈ ఇంట్లో మెదలుతూ ఉంటే, ఈ చెట్టును చూస్తూ వుంటే, ఒక ఆత్మీయుడైన బంధువు సమక్షంలో ఉన్నట్లనిపిస్తుంది. నాలో మెదలే ప్రాణమే అందులోనూ మెదలుతూంది. ఆస్తిని దానం చేయవచ్చు. అమ్మకోనూ వచ్చు. దాన్ని మనం ఆర్జించాం మనం ఖర్చు పెట్టు కుంటాం. అది మనం కాదు. కాని దేహాన్ని దానం చెయ్యలేము. అమ్ముకోనూ లేము, దేహం 'మనం' కాకపోయినా, మనది. ఈ చెట్టు కూడా మనదే నాయనా! ఇంక దాని జోలికి పోకు."

సాంబయ్య శాంతించాడు. శీతయ్య చేసిన ఉపదేశంలో నిజం ఉందనిపించింది. మౌనంగా లేచి వెళ్ళిపోయాడు. కాని రాత్రి మరో ఉపదేశం ప్రారంభమైంది. భార్య లచ్చమ్మకీ వేదాంతం ఏం నచ్చలేదు.

"చూడండీ, ప్రపంచంలో అందరు తెలివితక్కువ వారేనా ఒక్క మీరూ మీ నాన్నా తప్ప. అసలీ వేదాంతం దృష్టితో చూస్తే మనం తిండి తినగలమా? బట్ట కట్టగలమా? మాట వరసకి అనుకుందాం. చెట్లను నరకకూడదు అని శాసనం చేసేరను కుందాం. అప్పుడు ప్రపంచం ఎలా ఉంటుంది? కొంచెం ఆలోచించండి. కలప లేకుండా మీ నాన్నగారేనా ఇళ్లు కట్టుకోగలరా? కట్టెలు లేకుండా తిండెలా వస్తుంది? ఏదో ముసలాయన చాదస్తంగా చెప్పిన కబుర్లను పట్టించుకోకండి. ఒకటి రెండు రోజులు పోయాక మనుషుల్ని పిల్చి చెట్టు కొట్టిం చేయండి. కాకపోతే రెండు కేకలేస్తాడు. మరేం భయంలేదు. తలవంచుకుంటే సరి పోతుంది." లచ్చమ్మ మాటలు కూడా నచ్చాయి సాంబయ్యకి. ఎంతమంది చెట్లను కొట్టడం లేదు? ఇంతకూ చెట్లను కొట్టకుండా నాగరికత సాధ్యమేనా? సాంబయ్య ఒక నిశ్చయానికి వచ్చేడు. ఇంక తిరుగు లేదు.

వారం రోజులు గడచాక, ఒకరోజు ఉదయమే ఇద్దరు మనుష్యులు చెట్టును కొట్టడం ప్రారంభించారు. కొమ్మ దభీమని విరిగి పడింది. శీతయ్య హృదయం కలుక్కుమంది. మనవణ్ణి పిలిచి అడిగాడు, ఆ శబ్దం ఏమిటనీ. వాడు వచ్చీరాని మాటలతో నాన్న చెట్టు కొడుతున్నాడని చెప్పాడు. శీతయ్యకు అంతా అర్థమైంది. బాధగా కళ్లు మూసుకున్నాడు. కొమ్మలు పడుతూన్న కొద్దీ శీతయ్య గుండెలో పోట్లు ఎక్కువవసాగాయి. మధ్యాహ్నానికి చెట్టును కొట్టడం సగం పూర్తయింది. శీతయ్య బాగా నీరసపడ్డాడు. లచ్చమ్మ అన్నం తెచ్చింది. శీతయ్య ముట్టుకోలేదు. అలిగేడను కొంది లచ్చమ్మ. అన్నం అక్కడే ఉంచి వెళ్లి పోయింది. కొమ్మలు, రెమ్మలూ పెళ పెళ విరిగి పడుతున్నాయి. శీతయ్య భరించలేని మూగ వేదన అనుభవించాడు. సాయంకాలం నాలుగు

గంటలకు చెట్టు కూలింది. సరిగ్గా అదే సమయంలో శీతయ్య ప్రాణ వాయువు లనంతంలో లీనమయ్యాయి.

కొద్ది సేపట్లో ఏదో ఘనకార్యం చేసిన వాడిలా సాంబయ్య లోనికి వచ్చాడు. లచ్చమ్మ అతనిని మెచ్చుకొంది. ఇంటి ముందిప్పుడెంత విశాలంగా కనిపిస్తోంది! ఇప్పుడు పక్షులు లేవు. ఏ విధమైన శబ్దంలేదు. ఆ సంగతి చెప్దామని తండ్రి దగ్గరకు వెళ్లాడు సాంబయ్య. 'నాన్నా' అని పిలిచేడు. జవాబు రాకపోవడం చూచి, దగ్గరకు వెళ్లి కుదిపి లేపాడు. అప్పటికీ జవాబు లేకపోవడంతో గాభరాగా శ్వాస చూచాడు. నాడి పరీక్షించాడు. ఇంకే ముంది? శీతయ్య గతించాడు. సాంబయ్య నిర్ఘాంత పోయాడు. దోషిలా నిలబడ్డాడు. భార్య లచ్చమ్మ విలవిలా విలపించింది. శీతయ్య ప్రాణం చెట్టులో ఉందా? పేదరాశి పెద్దమ్మ కథల్లో అయితే ఒక రాక్షసి ప్రాణం ఒక చెట్టులోనో, చిలకలోనో ఉంటుంది. కాని మానవ జీవితంలో అలా ఉంటుందా? ఏమో శీతయ్య చెప్పాడు తనూ చెట్టూ ఒకటేనని. ఇప్పుడు చెట్టూ లేదు, శీతయ్యా లేడు. ఉన్నదల్లా శ్మశానం లాటి ప్రశాంతి. ఆ అనంత నిశ్శబ్ద వాతావరణంలో, అశాంతి రేగిన హృదయంతో నిలబడ్డాడు సాంబయ్య తండ్రినీ చెట్టునూ చూచుకుంటూ.

✸

కృష్ణాపత్రిక, 20-4-1968.